క్లుప్తంగా

స్వర్ణకారుల కుటుంబాల అభ్యున్నతికి కృషి



కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ–4 సర్వేలో గుర్తించిన స్వర్ణకారుల కుటుంబాల అభ్యున్నతికి మార్గదర్శకులు కృషి చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు సూచించారు. ఏట్రవారిపాలెంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 2,293 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. వీటిలో 33మంది మార్గదర్శకులు 289 కుటుంబాలను దత్తత తీసుకున్నారని చెప్పారు. బంగారు కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు మార్గదర్శకులు కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



చందోలు(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీలింగోద్భవస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ మండపం నిర్మాణానికి శుక్రవారం ఆలయ మేనేజర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో వెగా జ్యూలర్స్ అధినేత వనమా నవీన్ కుమార్ దంపతులు శంకుస్థాపన చేశారు. అలాగే ఆలయంలో నూతనంగా నిర్మించిన పురాణ కాలక్షేప భవనాన్ని తెల్లబాటి శ్రీనివాసరావు దంపతులు, సనకా రఘువంశీ దంపతులు ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వాస్తు హోమం నిర్వహించి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సీఐ హజరత్ బాబు దంపతులు, చందోలు ఎస్ఐ శివకుమార్ దంపతులు పాల్గొని స్వామివారికి తలంబ్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

సీఎంపై ఆరోపణలు తగదు

రేపల్లె: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల వాగ్దానాల్లో సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుంటే వైఎస్సార్ సీపీ, వామపక్షాలు అమలు చేయడం లేదంటూ గగ్గోలు పెట్టడం సబబుకాదని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ, పెన్షన్, అన్నా క్యాంటిన్, దీపం పథకాలను ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవతోపాటు ఆగస్ట్ 15 నుంచి మహిళల ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుకు విద్యార్థులు ఎంపిక

అమర్తలూరు(వేమూరు): మండలంలో షైనింగ్ స్టార్ అవార్డుకు ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ కనపాల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి శ్రాక్రైడ్ హార్ట్స్ విద్యార్థులు ఇందిర ప్రియదర్శిని, అమృత గౌస్ అహ్మద్, దేవిశ్రీ, ఎంపికైయ్యారు. జెడ్పీ హైస్కూల్ నుంచి అమృతలూరు దేవరకొండ చిరంజీవి, పెదపూడి జయ, సౌజన్య, మోపర్రు చైతన్య ఈ అవార్డులకు ఎంపికైయ్యారు. వీరికి ఈనెల 9వ తేదీన అవార్డులు ప్రదానం చేస్తారని తెలిపారు. అవార్డుతో పాటు రూ. 20 వేలు నగదు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



తెనాలిఅర్బన్: కొల్లిపర మండలం తూములూరు గ్రామంలోని క్రిష్టియన్‌పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో అందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. తెనాలిలో శుక్రవారం సాయంత్రం విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5గంటలకు సీనియర్ ఐపీఎస్ అధికారి పివి.సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహావిష్కణ చేయనున్నట్లు చెప్పారు. అలాగే వేమూరు, తాడికొండ ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీమంత్రి మేరుగ నాగార్జున, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారులు ఉప్పులేటి దేవిప్రసాద్, మేకతోటి దయాసాగర్, తదితరులు పాల్గొంటారని చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ తెనాలి మోహనరావు, మాజీ సర్పంచ్ బేతాళ భూషణం, కనపర్తి సుధాకర్, అక్కిదాసు కిరణ్‌కుమార్, జిడుగు పీటర్, గల్లా జ్ఞాన శేఖర్, డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, బి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల ఊసే లేదు

- పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతల్లో ఆందోళన
- సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూపులు



నగరంలో దుక్కులు దున్నుతున్న రైతు

నగరం: ఖరీఫ్ సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది మే చివరిలోనే వర్షాలు పడటంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగానే పంట పొలాల్లో దుక్కులు దున్నడం, ఎరువులు తోలించడం వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఇప్పటి వరకు సబ్సిడీ విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సబ్సిడీ వరి విత్తనాల కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు. మండలంలో ప్రతి ఏడాది ఖరీఫ్ సాగులో 28వేల ఎకరాల్లో వరి పంట సాగు వుతుంది. గత ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు అధికంగా పడటంతో వరి పంట ముంపునకు గురైంది. తర్వాత వర్షాభావ పరిస్థితులు, సాగునీటి సమస్య తలెత్తడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ఈ ఏడాది రుతు పవనాలు ముందుగానే ప్రవేశిస్తాయని వాతావరణ నిపుణులు పేర్కొనడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గతవారంలో వర్షాలు పడటంతో రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. పంట పొలాల్లో కంపోస్ట్ ఎరువులను తోలి వాటిని వెదజల్లి ట్రాక్టర్‌లతో దుక్కులు దున్నుతున్నారు. ఈ సమయంలో దుక్కులు దున్నితే చీడపీడలు నివారించవచ్చుననే ఆలోచనతో రైతన్నలు అధిక సంఖ్యలో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. దుక్కులను దున్ని పచ్చిరొట్ట పైర్లు జీలుగ, పిల్లిపెసర, జనుమును పంట భూముల్లో జల్లుతున్నారు. ఈ నెల చివరిలో రైతులు వరినారు మడులను పోసేందుకు పంట భూములను తయారు చేస్తున్నారు. రోటోవేటర్‌తో దుక్కులు దున్నితే భూమిలోని గడ్డికూడా కుళ్లి పంటకు బలం చేకూరుతుంది. కావున ఎక్కువ మంది రైతులు రోటోవేటర్ ద్వారా దుక్కులను మెత్తగా దున్నుతున్నారు.



పంట పొలాల్లో వేసిన కంపోస్ట్ ఎరువుల కుప్పలు

సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందేనా..?

వర్షాల రాకతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ, పాలకులు నిర్లక్ష్య వైఖరి రైతులకు శాపంగా మారింది. గత ప్రభుత్వంలో జూన్‌లోనే రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించేవారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సబ్సిడీ విత్తనాల ఊసే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 28 వేల ఎకరాల్లో వరిసాగుకు 170 టన్నుల వరి విత్తనాలు అవసరం ఉన్నది. అయితే ఇప్పటి వరకు విత్తనాలు మండలానికి రాకపోవడంతో రైతులు వాటి కోసం ఎదురుచూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్సిడీ విత్తనాలు తర్వితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

త్వరలోనే విత్తనాలు అందిస్తాం

ఖరీఫ్ సీజన్‌కు అవరసమైన విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపాం. త్వరలోనే విత్తనాలు వస్తాయి. వచ్చిన వెంటనే రైతులకు అందిస్తాం.

– రమేష్‌బాబు, మండల వ్యవసాయశాఖ అధికారి

ఆధ్యాత్మిక రంగంలో రాంబాబుకు డాక్టరేట్



రాంబాబుకు డాక్టరేట్ అందిస్తున్న వర్శిటీ ప్రొఫెసర్ వరప్రసాద్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ శ్రీనివాస్

రేపల్లె: బాపట్ల జిల్లా రేపల్లె మండలం మోళ్లగుంట గ్రామానికి చెందిన పీతా రాంబాబు అమెరికాకు చెందిన డేస్ప్రింగ్ థియోలాజికల్ టెక్సాస్ అమెరికా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆధ్యాత్మిక రంగంలో రాణిస్తున్న ఆయన సేవలను గుర్తించిన వర్శిటీ గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగిన ఓ సదస్సులో రాంబాబుకు సినీతారలు తిరుపతి దొరయ్యస్వామి, పృథ్వీరాజు, శ్రీనివాస్, బాబూమోహన్‌లు యూనివర్శిటీ ప్రొఫెసర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టరేట్ పట్టాను అందజేశారు. రాంబాబుకు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నాటుసారాతో జీవితాలు నాశనం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్

నిజాంపట్నం: నాటుసారా తాగితే జీవితాలు నాశనం చేసుకున్నట్లేనని నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మార్టూరి శ్రీరామ్ ప్రసాద్ పేర్కొన్నారు. నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలను తెలుపుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నగరం మండలంలోని దిండి పంచాయతీలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారా తాగడంతో తమ జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా కుటుంబం సైతం చిన్నాభిన్నం అవుతుందన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా ఈ ప్రక్రియలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని అదవల, పరిశావారిపాలెం, జంపనివారిపాలెం, యేమినేనివారిపాలెం, కేసనవారిపాలెం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ కె.వెంకట రమణ, కె.మధుసూదనరావు, అడాప్షన్ ఆఫీసర్‌లు కె.శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

పని గంటల పెంపు దుర్మార్గం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్



బాపట్లటౌన్: కార్మిక వర్గానికి నష్టంచేకూర్చే విధంగా కార్మిక చట్టాలను మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. పని గంటలను 8 నుంచి 12 పెంచడం దుర్మార్గమని అన్నారు. మహిళలను రాత్రిపూట పనిచేయడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కూడా సరైన చర్య కాదన్నారు. రాత్రిపూట మహిళలు పని చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం అంటే మహిళా కార్మికుల శ్రమను దోచుకోవడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పని గంటల విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల 9వ తేదీన జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్ల వెంట వ్యర్థాలను తొలగించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఐతానగర్ గోలిడొంకలో శుక్రవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించారు. రోడ్ల వెంట వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన వాటిని తొలగించి రోడ్డును శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

యథేచ్ఛగా మద్యం బెల్టు షాపులు



బెల్టు షాపు నిర్వహిస్తున్న రెస్టారెంట్

వేమూరు: మద్యం అమ్మకాల్లో బెల్టు షాపుల నిర్వాహకులు పోటీ పడుతున్నారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో బెల్టు షాపుల నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. మేరీ మాత గుడి కూడా చూడకుండా బెల్టు షాపు కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వ్యాపించాయి. జంపని ఊరు బయట ఉన్న రెస్టారెంట్‌లో బెల్టు షాపు కొన్ని నెలలు నుంచి నిర్వహిస్తున్నారు. అయితే రెస్టారెంట్‌లోని బెల్టు షాపు నిర్వాహకులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జంపని గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మహిళలు కోరుతున్నారు.

8న సీనియర్ సిటిజన్లకు యోగా

తెనాలి: స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఈనెల 8వ తేదీన సీనియర్ సిటిజన్లకు యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఈనెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా సీనియర్ సిటిజన్లకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అసోసియేషన్ సభ్యులంతా ఆరోజు ఉదయం 6.30 గంటలకు వీజీకే భవన్‌కు చేరుకోవాలని సూచించారు.

జనాభా నిర్వహణ విధానంపై గ్రామ సభలు

తాడికొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు తాడికొండ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జనాభా నిర్వహణ విధానంపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.సమతా వాణి తెలిపారు. ఈ మేరకు మండలంలో గ్రామ పంచాయతీల వారీగా 'జనాభా నిర్వహణ విధానం.. పర్తి కుటుంబం.. మీ అభిప్రాయం మార్గ దర్శనం'కు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 9వ తేదీన బండారుపల్లి, బేజాత్పురం, గరికపాడు, ముక్కామల, ఫణిదరం.. 10న కంతేరు, ఎల్‌జీపూడి, మోతడక, నిడుముక్కల, పాములపాడు, పొన్నెకల్లు, రావెల.. 11న తాడికొండ గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలి



జేసీ భార్గవ్‌తేజకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

తెనాలి: తమ ఆరాధ్య దైవమైన ఏకలవ్య మహారాజు జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవాసంఘం విజ్ఞప్తిచేసింది. సేవాసంఘం రాష్ట్ర కమిటి ఆదేశాలతో జిల్లా కమిటి నాయకులు శుక్రవారం గుంటూరులో జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవాసంఘం రాష్ట్ర కమిటీ తరపున గుంటూరు జిల్లా కమిటీ, గిరిజన సంఘాల తరపున ఈ విజ్ఞాపన చేసినట్టు తెనాలిలో ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గరిక శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర జగదీష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి పాలపర్తి ఆదినారాయణ, గిరిజన నాయకులు మేడ రామకష్ణ, యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుందనాటి సంజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మేడసరి వెంకటరామయ్య పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



బాపట్లలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గ్రంథాలయాధికారి శివాజీగణేషన్

నగరం: నగరం మండలంలోని మంత్రిపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. సర్పంచ్ ఎం.ప్రమీల మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులు గ్రంథాయాలను సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన సిబ్బందిని అభినందించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, చిత్రలేఖనం, కథలు చెప్పడం, పరుగుపందెం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ జొన్న బ్రహ్మేంద్ర, గ్రామస్తులు, పాఠకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

బాపట్ల: పుస్తక పఠనం విజ్ఞానానికి దోహదపడుతుందని గ్రంథాలయాధికారి ఎ.శివాజీగణేషన్ పేర్కొన్నారు. బాపట్ల శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్‌క్యాంపు ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీగణేషన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సమ్మర్‌క్యాంపు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. క్యాంపులో విద్యార్థులు నేర్చుకున్న వాటిపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏవీవీ స్కూలు ప్రధానోపాధ్యాయులు సత్యవతి, డాక్టర్ సాయిబాబా, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి



కొలకలూరు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు ప్రాధాన్యతను ఇవ్వాలని ఎంపీడీవో అత్తోట దీప్తి సూచించారు. శుక్రవారం రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాన్ని నాలుగు భాగాలుగా విభజించి ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్సీ కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాల్వల్లో పీల్డ్ తీయడం, రోడ్లు, మురుగు కాల్వల వెంబడీ పిచ్చిమొక్కలు, అడ్డంకులు తొలగించడం, శానిటేషన్ మెరుగుపరచడం వంటి కార్యక్రమాలు ప్రతిరోజు నిర్వహించాలని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎండీ కరిముల్లా, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో మంచి భవిష్యత్

తెనాలిఅర్బన్: సాంకేతిక విద్యను అభ్యసించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఐటీఐ ప్రవేశాల కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రవేట్ ఐటీఐ కళాశాలలో చదివేందుకు 298 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీరందరి మెరిట్ ఆధారంగా ఆయా ట్రేడ్‌లో అడ్మిషన్లు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రవేట్ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోవింద నామార్చన



గోవింద నామార్చన చేసిన చిన్నారులు

తెనాలి: జేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా శుక్రవారం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, 108 మందిచే గోవింద నామార్చనను నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. తొలుత చిన్నారులతో స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం ధ్వజస్తంభం నుండి ప్రదక్షణగా మాడవీధులలో గోవిందనామ సంకీర్తన, కోలాట ప్రదర్శన చేసుకుంటూ మూడుసార్లు ఆలయ ప్రదక్షిణ చేశారు. దేవస్థానం కళ్యాణ మండపానికి చేరి పిల్లలందరిచే గోవింద నామ సంకీర్తనలు చెప్పించారు. ఆలయ అర్చకులచే రిషికశ్రీ, అందె తన్మయి, దేవిలలిత, హరిప్రియ, ప్రవస్తి, తులసికి జ్ఞాపికలను బహూకరించారు. ఆలయ సిబ్బంది చిన్నారులకు ప్రసాదం అందజేశారు. పిల్లల్లో భక్తిభావం పెంపొందించేందుకే కార్యక్రమం చేస్తున్నామని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. డిసెంబర్ నెలలో తిరుమలలోనూ గోవిందనామ సంకీర్తన చేయించాలని భావిస్తున్నామని చెబుతూ, ఆసక్తి గలవారు ప్రతి ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గోవిందనామాలు నేర్చుకోవచ్చని సూచించారు. సభ్యులు అందె బాలచంద్రమౌళి, కేశవరావు, దేవానంద్, భారతీ దేవి, రమాదేవి, సావిత్రి, సుజాత పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

తెనాలిటౌన్: ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పర్యవేక్షించారు. ఖరీఫ్‌సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో అవసరమైన కాల్వల పూడికతీత, మట్టి పనులను వేగవంతం చేయాలని ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల అర్జీలు క్రమేణ పరిష్కరిస్తాం



తాడికొండ: రాజధాని ప్రాంతంలో రైతులు, రైతు కూలీలు ఇచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సూచించారు. శుక్రవారం తుళ్లూరులోని ఏపీ సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసైన్డ్ భూముల సమస్యలు, వీధిపోటు సమస్యలపై పలువురు రైతులు అర్జీలను అందజేశారన్నారు. ఈ అర్జీలపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. పరిష్కారాలపై సంబంధిత శాఖలకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 23 ఫిర్యాదులు అందాయన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కేఎస్ భాగ్యరేఖ, పి.పద్మావతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా అవార్డుకు చిరుహాసిని



తెనాలి: పదోతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బహూకరించే ప్రతిభా అవార్డుకు చిరువ్యాపారి కుమార్తె ఎంపికైంది. స్థానిక నారాయణ స్కూల్‌లో పదోతరగతి చదివిన బాలిగ చిరుహాసిని గత మార్చిలో జరిగిన పరీక్షల్లో 582/600 మార్కులతో ఉత్తీర్ణురాలైంది. ఎస్టీ వర్గానికి చెందిన చిరుహాసిని చదువు కోసం తండ్రి బాలిగ శివన్నారాయణ ఏడాదిగా తెనాలిలోనే నివసించారు. ఆయన స్వగ్రామం తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా మండల కేంద్రం వేమూరు. అక్కడ పొట్టేలు మాంసం విక్రయిస్తూ జీవిస్తుంటారు. ఎల్‌కేజీ నుంచి అయిదో తరగతి వరకు వేమూరులోని శ్రీవివేకానంద స్కూలులో చదివిన చిరుహాసిని, అయిదో తరగతి నుంచి తెనాలిలోని నారాయణ స్కూలులో చదివింది. ప్రతిరోజూ ఊరి నుంచి స్కూలు బస్సులో వచ్చిన చదువుకుంది. పదో తరగతిలో బిడ్డను శ్రద్ధగా చదివించుకుందామని తల్లిదండ్రులు సుధాలక్ష్మి, శివన్నారాయణలు ఏడాదిగా ఇక్కడే కాపురం ఉన్నారు. బిడ్డ తెలివితేటలు, శ్రమకు తగిన ఫలితం దక్కిందని ఆ దంపతులు మురిసిపోతున్నారు.